క్లుప్తంగా

సింగ్‌నగర్‌లో పాస్టర్ల నిరసన



మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పాస్టర్‌లకు భద్రత లేకుండా పోయిందని పాస్టర్ చార్లెస్ ఆరోపించారు. మంగళవారం రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ బుధవారం సింగ్ నగర్ ప్రాంతంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మృతి అనుమానాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతి పట్ల దర్యాప్తు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. క్రైస్తవుల పట్ల కొంతమంది అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అట్టి వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు ప్రత్తిపాటి ప్రకాష్, రాజారత్నం శ్యామ్, చిట్టెం రాజు తదితరులు పాల్గొన్నారు.

కక్షిదారుల సౌలభ్యానికే మధ్యవర్తిత్వ కేంద్రాలు



విజయవాడలీగల్: కోర్టు కేసులతో ఇబ్బంది పడుతున్న వారికి అవగాహన కల్పించి, వారి గొడవలకు దారితీసిన అంశాలను సద్దుమణిగేలా చేసి, వారి మధ్య సత్సంబంధాలు నెలకొల్పేలా చేయడానికి మధ్యవర్తిత్వ కేంద్రాలు ఉపయోగపడతాయని ట్రైనర్ అరుణాచలం పేర్కొన్నారు. బెజవాడ కోర్టు కాంప్లెక్స్‌లో సోమవారం నుంచి జరుగుతున్న మీడియేషన్ శిక్షణ తరగతులలో భాగంగా కక్షిదారులతో ముఖాముఖిలో అరుణాచలం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ధనం, కాలం వృథా కాకుండా వారి మధ్య సత్సంబంధాలు నెలకొనేలా చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం కక్షిదారుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా మధ్యవర్తిత్వ కేంద్ర తొలిసభ్యుడు వేముల హజరత్తయ్యగుప్తా, న్యాయవాదులు ఝాన్సీరాణి, శివరామకృష్ణ, రాము, ఉషారాణి పాల్గొనగా, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది సహకరించారు.

బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): అజిత్ సింగ్‌నగర్ నందమూరి నగర్ వలివర్తి వారి స్ట్రీట్‌లోని క్రికెట్ ఇండోర్ గ్రౌండ్‌లో బుధవారం శ్రీ లలితేశ్వర బ్రాహ్మణ బాక్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. ఈ టోర్నీలో మూడు రోజులపాటు 13 జిల్లాలకు చెందిన పురోహితులు పాల్గొంటారని.. శనివారం నాడు జరుగబోయే ఫైనల్ పోటీలలో గెలుపొందిన జట్టుకి ట్రోఫీ ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గార్లపాటి విజయకుమార్, రాళ్ల పల్లి పవన్,చొడవరపు శివ తదితరులు పాల్గొన్నారు

సేవాగుణం అలవర్చుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకుని, వీలైనంతగా సేవా కార్యక్రమాలు చేయాలని శారదా విద్యాలయ పాఠశాల కన్వీనర్ పెనుమత్స అప్పలరాజు సూచించారు. స్థానిక అజిత్‌సింగ్ నగర్ శ్రీ శారదా విద్యాలయ పాఠశాల ఆధ్వర్యాన బుధవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని పెనుమత్స తిరుపతిరాజుతో కలిసి మజ్జిగ పంపిణీను ప్రారంభించారు. లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు వాసు, అనంత లక్ష్మీదేవి సేవా సంఘం సెక్రటరీ సాంబశివ రాజు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

6న శ్రీరామ శోభాయాత్ర

విజయవాడ కల్చరల్: శ్రీరామ శోభాయాత్ర సమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించే శ్రీ రామశోభాయాత్రను విజయవంతం చేయాలని తాళ్లాయపాలెం శైవపీఠాధిపతి శివస్వామి పిలుపు నిచ్చారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ధర్మానికి ప్రతిరూపం శ్రీ రామచంద్రుడని, కోట్లాది భారతీయులకు పూజనీయుడన్నారు. శ్రీరామశోభాయత్ర కన్వీనర్ నాగలింగం శివాజీ మాట్లాడుతూ ర్యాలీ బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి ప్రారంభమై ఏలూరు రోడ్డు మీదుగా సాగుతుందని తెలిపారు.





● ఆత్మీయతా.. ఆధ్యాత్మికత

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌పీసీ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. పెద్ద ఎత్తున హాజరైన ముస్లింలతో కలిసి ఆయన నమాజు చేసి, ఇఫ్తార్ స్వీకరించారు.
ఈ సందర్భంగా గురునానక్‌కాలనీ పరిసర ప్రాంతాలన్నీ జన సందోహంతో కిక్కిరిశాయి. జై జగన్ నినాదాలతో హోరెత్తాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









చిరువ్యాపారులకు రక్షణ కల్పించాలి

సీఐటీయూ నాయకుడు దోనేపూడి కాశీనాథ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): చిరువ్యాపారులకు రక్షణ కల్పించాలని, వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ నాయకులు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. చిరువ్యాపారులపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు నేతల దౌర్జన్యాలు ఆపాలని, వారికి రక్షణ కల్పించాలని, అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఈనెల 29వ తేదీన అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాధర్నాలో చిరువ్యాపారుల పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం బీసెంట్ రోడ్ మహంతి మార్కెట్ నుంచి లెనిన్ సెంటర్ వరకు కరపత్రాలు పంచుతూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు.



బీసెంట్ రోడ్డులో ప్రచారం నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కక్ష సాధింపు సరికాదు..

ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు చిరు వ్యాపారస్తుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇది సరైన విధానం కాదని హెచ్చరించారు. 50 సంవత్సరాలు పైగా నగరంలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న హాకర్స్‌ను తొలగించాలని టీడీపీ ప్రజా ప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని, ఏమి ఆశించి ఈ పనులు చేస్తున్నారో ప్రజలకు వివరించాలన్నారు. పోలీస్ కమిషనర్, మునిసిపల్ కమిషనర్లు స్పందించి చిరు వ్యాపారస్తులకు న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు, కోశాధికారి వై.సుబ్బారావు, బాలబొమ్మ లక్షణ, హాకర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి సీహెచ్ మురళి, ఎస్కే మస్తాన్, కుమార్, వై.స్రవంతి, బి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శతక సాహిత్యం విస్తృతం కావాలి

విజయవాడ కల్చరల్: శతక సాహిత్యం విస్తృతంగా రావాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. కోనేరు కల్పన రచించిన కందపిలకలు(తెలుగు సంవత్సరాల శతక గ్రంథం)ను బుధవారం విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆవిష్కరించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో విశిష్టమైనది సాహిత్య ప్రక్రియ శతకమన్నారు. శతక సాహిత్యంలో సామాజిక అంశాలతోపాటు భక్తి సంబంధిత అంశాలుంటాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ తెలుగు నెలలు అంశంగా కవయిత్రి కోనేరు కల్పన అద్భుతమైన ప్రతిభను చూపినట్లు తెలిపారు.



'కందపిలకలు'ను ఆవిష్కరిస్తున్న బుద్ధ ప్రసాద్, గోళ్ల నారాయణరావు తదితరులు

లయోలా కళాశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు గ్రంథ విశేషాలు వివరించారు. రచయిత్రి కోనేరు కల్పన రచనకు సంబంధించిన అంశాలను వివరించారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పోస్టర్ ఆవిష్కరించిన ఎస్ఆర్ఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సేవలను సద్వినియోగం చేసుకుని మంచి ర్యాంకు సాధించాలని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ఎస్ఎఫ్ఐ నేతలతో కలిసి ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఉచిత కోచింగ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిష్ణాతులైన అధ్యాపకులచే శిక్షణ ఇస్తామన్నారు. ఈ కోచింగ్ కు ఏటా 250 మంది పైగా విద్యార్థులు హాజరు అవుతున్నారని.. వారికి దాతల సహకారంతో ఉచితంగా స్టడీ మెటీరియల్స్ కుడా అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు మాధవ్, కుమార్ స్వామి, నగర నాయకులు పాల్గొన్నారు.



ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ భాగ్యలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నేతలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావు పేట సెక్షన్ జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్ 11కేవీ డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 27వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్ర బాబు ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలరెడ్డి రోడ్డు, చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ఏరియా, స్టేట్ గెస్ట్ హౌస్, డోర్నకల్ రోడ్, కాళేశ్వరావు రోడ్, సూర్యనారాయణ వీధి, దాసరి వారి వీధి, వెంకటరత్నం వీధి, మాదిరెడ్డి వారి వీధి, నరసింహారావు నాయుడు వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, జడగం వారి వీధి, వేమూరి వారి వీధి, పీసపాటి వారి వీధి తదితర ప్రాంతాలలో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: శ్రీ దుర్గా మల్లేశ్వరి సిద్ధార్థ మహిళా కాలేజీ బాల్ బ్యాడ్మింటన్ జట్టును ఎంపిక చేసినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన తెలిపారు. జట్టులో సరస్వతి, భువనేశ్వరి, ఉమామహేశ్వరి, స్రవంతి, కోటేశ్వరి, జీవనరవళి, శివనాగలక్ష్మి, రమాదేవి, దేవిశ్రీ చోటు దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఈనెల 29 నుంచి చెన్నైలోని అలగప్ప యూనివర్సిటీలో జరిగే జాతీయ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. జట్టు బృందాన్ని కాలేజీ ప్రాంగణంలో కాలేజీ కన్వీనర్ శ్రీ లలితప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. మాధవి, వ్యాయామ విద్య అధ్యాపకురాలు డాక్టర్ ఎన్. హేమ బుధవారం అభినందించారు.

సంగీత, సాహిత్యాలకు పత్రికలు ప్రాధాన్యమివ్వాలి

విజయవాడ కల్చరల్: సంగీత సాహిత్య కార్యక్రమాలకు పత్రికలు ప్రాధాన్యం నివ్వాలని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ప్రిన్స్ డిజిటల్ మీడియా ఆధ్వర్యంలో గవర్నర్ పేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ కార్యాలయంలో బుధవారం మార్నింగ్ బెల్స్ తెలుగు సాహిత్య రాజకీయ పక్ష పత్రిక కోస్తా ఆంధ్రా ఎడిషన్స్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. పత్రికను ఆవిష్కరించిన గుప్తా మాట్లాడుతూ ఒకప్పుడు భారతి మాస పత్రిక తెలుగు వారికి విశిష్టమైన సేవలను అందించిందని అదే సంప్రదాయాన్ని పత్రిక ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ పత్రిక విలువలను పాటించాలని సూచించారు. పత్రిక సంపాదకుడు ప్రిన్స్ మాట్లాడుతూ పత్రిక ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. సాహితీవేత్త డాక్టర్ ప్రభాకర్, మల్టిపుల్ కౌన్సిలర్ శాంతి శ్రీ, వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు కె. డేవిడ్ రాజు, చింతకాయల చిట్టిబాబు, బీవీ వీరభద్రరావు పాల్గొన్నారు.



పత్రిక ఆవిష్కరణలో పాల్గొన్న వేముల హజరత్తయ్య గుప్తా, గోళ్ల నారాయణరావు తదితరులు

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తులు

మదురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకుగాను మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిప్లొమా, ఏదైనా డిగ్రీ ఆపైన అర్హత కల్గిన అభ్యర్థులకు ప్రత్యేకంగా 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు నూతన సాంకేతికతతో కూడిన పరిజ్ఞానంతో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తోపాటు ప్రముఖ సంస్థలో ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇంటర్-డిగ్రీ మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో సంప్రదించాల్సిందిగా ఆమె సూచించారు. మరింత సమాచారం కోసం 77996 69907 నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

రేపు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతం రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆవిర్భావ వేడుకలు నిర్వహించి యూనియన్ జెండా ఆవిష్కరించాలని, మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, నాయకులను ఆహ్వానించాలని, వారితో సమన్వయం చేసుకుంటూ వేడుకలు జరపాలన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

మైనర్లపై లైంగిక వేధింపులకు కఠిన శిక్షలు

పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ

పాయకాపురం(విజయవాడరూరల్): పద్దెనిమిదేళ్ల లోపు బాల, బాలికలపై లైంగిక వేధింపులు చట్టరీత్యా నేరమని, కఠిన శిక్షలుంటాయని విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ అన్నారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ నందు పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి వి.భవానీ మాట్లాడుతూ అవగాహన లేక పిల్లలు ప్రేమ పేరుతో తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారన్నారు. టెక్నాలజీని మంచికోసం వినియోగించాలని, మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయిని అధిరోహించాలన్నారు. పిల్లలను లైంగికంగా వేధించి, కేసుల్లో చిక్కుకుంటే వారి జీవితం అంధకారమవుతుందన్నారు. పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణవేణి విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. మహిళా పీఎస్ సీఐ కె. వాసవి, నున్న పీఎస్ సీఐ పి. కృష్ణమోహన్, ఎంఎల్ఎస్‌సీ ప్యానెల్ న్యాయవాది బెల్లం కొండ శేఖర్‌బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి వేల్పుల భవానీ

ఉత్సాహంగా 'ఇన్‌కెండో-2కే25'

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తరగతి గదిలో విద్యార్థులు చదువుకున్న అంశాలను మార్కెట్‌లోని అవసరాలను తీర్చే విధంగా ఉండాలని ఎస్‌జీఎస్‌టీ స్పెషల్ కమిషనర్ నూతలపాటి సౌమ్య చెప్పారు. సిద్ధార్థ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఇన్‌కెండో-2కే25 పేరుతో సిద్ధార్థ ఆడిటోరియంలో కామర్స్ విద్యార్థులకు పోటీలు బుధవారం జరిగాయి. సౌమ్య ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పాఠ్య పుస్తకాల్లో చదువుకున్న అంశాలను బయట మార్కెట్‌లో ఉన్న అంశాలను జోడించి పరిష్కారాలను ఆవిష్కరించాలని సౌమ్య అన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల యువత తమలోని నైపుణ్యాలను, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందుతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల్లో ఉన్న పాఠాలను చదివి రాయడం వల్ల పరీక్షల్లో మార్కులు వస్తాయని, వాటితో పాటుగా సమాజంలో ఉన్న సమస్యలను యువత నిశితంగా పరిశీలించి చదువుకున్న జ్ఞానంతో పరిష్కారాలను కనుగొనాలని చెప్పారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ కామర్స్ కోర్సును అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని చెప్పారు. సిద్ధార్థ కళాశాల కామర్స్ విభాగాధిపతి కోన నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సౌమ్య

ఉత్సాహంగా సాంస్కృతిక పోటీలు..

సభ అనంతరం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నగరంలోని కళాశాలతో పాటుగా గుంటూరు, తెనాలిలోని కళాశాలల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. క్విజ్, దలాల్ స్ట్రీట్, మైండ్ ఇట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, ఐపీఎల్ పోటీలతో పాటుగా మిస్టర్ అండ్ మిస్ ఇన్‌కెండో-2కే25 పేరుతో నిర్వహించిన ఫ్యాషన్ షో, గ్రూప్ డ్యాన్స్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు.

మధురంగా సంకీర్తనా గానం

విజయవాడ కల్చరల్: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుని వర్ధంతి సందర్భంగా కంచి కామకోటి పీఠపాలిత శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మల్లాది సూరిబాబు, మల్లాది సోదరులు నిర్వహించిన సంకీర్తనా గానం ఆకట్టుకుంది. తాళ్లపాక అన్నమాచార్యుడు రచించిన సంకీర్తనలను మధురంగా ఆలపించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యక్రమ నిర్వాహకుడు సి. రామ్మోనరావు మాట్లాడుతూ తెలుగు పదానికి గుడికట్టిన మహనీయుడు అన్నమయ్య అని అభివర్ణించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన దిశగా చక్కటి క్రమశిక్షణతో విద్య అభ్యసించాలని మూడో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి విద్యార్థులకు సూచించారు. మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో సత్యనారాయణపురంలోని రవీంద్ర భారతి స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండి, సత్ప్రవర్తతో చదువులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా బాలికలు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు చిన్న వయస్సు నుంచే బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పోక్సో చట్టంలో అనేక నేరాలకు తీవ్రమైన శిక్షలు ఉన్నాయని, జీవిత ఖైదు, మరణ శిక్షలు విధించే అధికారం కూడా ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవల అధికారి పగిడిపల్లి రాము, ఎస్ఎన్‌పురం ఉమెన్ ఎస్ఐ సౌజన్య, స్కూల్ ప్రిన్సిపాల్ హెప్సీబా పాల్గొన్నారు.



చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి జ్యోతి

30 నుంచి వసంత నవరాత్రి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో ఈనెల 30వ తేదీ నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు విశేషంగా పూజలు అభిషేకాలు అర్చనలు జరుగుతాయన్నారు. 30వ తేదీ ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున 4 గంటలకు విజయ వినాయక స్వామివారు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి విశేష పంచామృత అభిషేకం, అర్చనలు జరుగుతాయన్నారు.

దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 30వ తేదీ నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన వసంత నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వర ప్రసాద్ బుధవారం తెలిపారు. ప్రతి రోజు నీలకంఠేశ్వరస్వామి వారికి అభిషేకం, ఉదయం 10గంటలకు సుహాసినిలచే సామూహిక కుంకుమార్చన జరుగుతాయన్నారు. సాయంత్రం 7గంటలకు ఖడ్గ మాలార్చన అనంతరం విశేషంగా హారతులు ఇస్తామన్నారు. అలాగే అమ్మవారికి 30న పసుపు- కుంకుమ, 31న తులసీ, మారేడు, మరువం, వచ్చేనెల ఒకటో తేదీన తమలపాకులు, రెండో తేదీన గంధం, అష్టగంధం, మూడో తేదీన వివిధ రకాలపండ్లు నాలుగో తేదీన వివిధ రకాల పుష్పాలు, ఐదో తేదీన కూరగాయలు, ఆరో తేదీన గాజులు ఏడో తేదీన చీరలతో విశేషంగా పూజలు జరిగిస్తామన్నారు. వచ్చేనెల 6వ తేదీన శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఉదయం 10గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు.

హిందీ భాషతో బహుళ ప్రయోజనాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వివేక సుధ

పాయకాపురం(విజయవాడరూరల్): హిందీ భాష నేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయం సీనియర్ మేనేజర్ పి.వివేక సుధ అన్నారు. బుధవారం పాయకాపురం రాజీవ్‌నగర్లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ కార్యాలయంలో త్రైమాసిక హిందీ కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పి.వివేక సుధ మాట్లాడుతూ అధికార భాష నిబంధనల అమలులో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ ఇన్‌చార్జి, అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇలాంటి కార్యశాలలు ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించడం వల్ల అధికార భాషా విధానాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు.